
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

మంగళవారం 6 మే 2025

ఏపీవోగా కృష్ణసింగ్ బాధ్యతలు



ఏపీఓగా బాధ్యతలు చేపడుతున్న కృష్ణసింగ్

కడప ఎర్రముక్కపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ఏపీవో (అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్)గా సి.టి.కృష్ణసింగ్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఆదేశాల మేరకు ఆయన సోమవారం విధుల్లో చేరారు.

రైతులకు లాభాలు చేకూర్చండి

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

సీకేదిన్నె, మే 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో పయనించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సోమవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి ఆధ్వర్యంలో రెండు రోజుల దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ, సలహా మండలి సమీక్ష సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తలసరి ఆదాయాన్ని పెంపొందించడంతో పాటు వారి జీవన ఆర్థికస్థితిని మెరుగుపరచడం కోసం వ్యవసాయ శాస్త్రవేత్త, అధికారి, రైతులు, శ్రేయోభిలాషులు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గత 20 ఏళ్లుగా శాస్త్రీయబద్ధంగా సూచించిన సూచనలే రైతులు అనుసరించేవారని, కానీ ప్రస్తుతం రైతులే క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తలుగా ఎదుగుతుండడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్ కల్చర్ వ్యవసాయ రంగాన్ని పూర్తి స్థాయిలో మార్చివేసిందని, సాగునీటి వ్యవస్థలో కూడా విస్తృతమైన, ఉపయోగకరమైన, అనుకూలమైన పద్ధతులను అనుసరించేలా కొత్త పద్ధతులను వెతకాలని సూచించారు. అంతేకాకుండా గ్రామాలవారీగా వ్యవసాయ పరిశోధకులు, రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు సీజన్ వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, వాటికి ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ, ఆయా పైర్లకు అందాల్సిన పోషక విలువలు, ఎరువుల వాడకం, తదితర ప్రక్రియల నిర్వహణపై ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో వ్యవసాయ పంటల సాగు ప్రణాళికను సమర్థవంతంగా రూపొందించి రైతులకు లాభదాయకమైన పంటలను ఎంపిక చేయాలని శాస్త్రవేత్తలను కోరారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, రాస్ పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ సుమతిలు మాట్లాడారు. తదనంతరం దక్షిణ మండలంలో జిల్లాల విభజన తర్వాత తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, నెల్లూరు జిల్లాలకు సంబంధించి ఖరీఫ్‌లో గతేడాది వ్యవసాయ దిగుబడిలో విస్తరణ ప్రగతిపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం శాస్త్రవేత్తలు ప్రచురించిన పలు రకాల ప్రచురణ పుస్తకాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సుబాషిణి, పశుసంవర్ధకశాఖ అధికారిణి శారదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జగన్ కోటలో మహానాడు


● ఐదు లక్షల మందితో బహిరంగ సభ

● నాలుగు రోజుల ముందే కడపలో లోకేశ్ తిష్ట

● జిల్లా సమగ్రాభివృద్ధికి స్పష్టమైన డిక్లరేషన్

● రేపు భూమిపూజ

● హాజరుకానున్న ఇన్‌చార్జ్ మంత్రి సవిత, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్..?





మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడపలో ఈ నెల 27, 28, 29న నిర్వహించే మహానాడును నభూతో నభవిష్యత్‌గా నిర్వహించేందుకు టీడీపీ పక్కా ప్లాన్ చేస్తోంది. నిన్న జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలో వైసీపీకి చావుదెబ్బ కొట్టింది. మిత్రపక్షాలతో కలిసి మట్టికరిపించింది. ఇది స్టేట్‌లోనే సంచలనమైంది. ఇక జగన్ కోటలో మహానాడును కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. జగన్ సొంత గడ్డ కడపలోనే మహానాడును భారీ సక్సెస్ చేసి టీడీపీ తన పూర్వవైభవం కోసం అడుగులు వేస్తోంది. స్టేట్‌లో ఇతర జిల్లాల్లో ఇప్పటి దాకా నిర్వహించిన మహానాడు ఒక ఎత్తు అయితే, ఈ సారి కడపలో మరో ఎత్తు కానుంది. అందుకు మహానాడును భారీ సక్సెస్ చేసేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కార్యక్రమానికి నాలుగురోజుల ముందే కడపలో మకాం వేసి దగ్గరుండి ఏర్పాట్లు, ఇతరత్రా పర్యవేక్షించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రతిష్టాత్మకంగా మహానాడు

ఉమ్మడి కడప జిల్లాలో టీడీపీ ఆవిర్భావం నుంచి 2004 మునుపు వరకు టీడీపీ మెజార్టీ శ్రేణులు గెలుస్తూ వచ్చేవారు. బద్వేలు, జమ్మలమడుగు, కడప ఇలా కొన్ని నియోజకవర్గాలు కంచుకోటలా ఉండేవి. అయితే 2004 పరిస్థితులు తారుమారు చేస్తూ 2024 ఎన్నికల్లో పార్టీ పుంజుకుంది. ఉమ్మడి జిల్లాలో ఏడు స్థానాలు కూటమికి కట్టబెట్టింది. సొంత జిల్లాలో వైసీపీ చతికిలబడడం ఆ పార్టీ ఊహించలేకపోయింది. ఆ షాక్ నుంచి కోలుకోక మునుపే మళ్లీ మహానాడును కడపలో నిర్వహించి సీమ అభివృద్ధితో పాటు జిల్లా అభివృద్ధికి ప్రత్యేక రోడ్‌మ్యాప్ గీసి అటు పరిశ్రమలు, ఇటు వ్యవసాయరంగంపై పూర్తి స్పష్టత రోడ్‌మ్యాప్ గీయనున్నారు. కడపకు వచ్చే భారీ ప్రాజెక్టులపై సస్పెన్స్‌లో ఉంచారు. మహానాడు వేదికలో సీఎం చంద్రబాబు వెల్లడిస్తారని చెబుతున్నారు. వైజాగ్, చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయనున్నారు. ఇది పూర్తయితే పరిశ్రమలు క్యూకడతాయి. ఇప్పటికే కొప్పర్తిలో పలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పలువురు ముందుకు వస్తున్నారు.

ఉక్కుపై ముందుకు

ఇక కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు జిల్లావాసుల చిరకాల వాంఛ. అయితే మూడేళ్లలో స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేస్తామని జగన్ కొబ్బరికాయ కొట్టారు. ఐదేళ్లు పూర్తయ్యే సరికి కనీసం ప్రహరీ గోడ కూడా పూర్తి చేయలేకపోయారు. కాగా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని ఇటీవల చంద్రబాబు ప్రకటించారు. జిందాల్‌తోనే నిర్మాణం చేపడుతుందని అంటున్నారు. దీంతో పాటు ఇక మహానాడు సక్సెస్ చేసి టీడీపీలో మరింత జోష్ నింపాలని భావిస్తున్నారు. ఇందుకు గానూ మంత్రి నారా లోకేశ్ నాలుగురోజులు ముందుగానే కడపలో మకాం వేసి అందరినీ సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రేపే భూమి పూజ

కడప నగర శివారులోని పబ్బాపురంలో ఉన్న 120 ఎకరాల టీచర్స్ లేఅవుట్‌లో మహానాడు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పనులు మొదలయ్యాయి. అయితే రేపు స్టేజీ ఇతర నిర్మాణాల కోసం భూమిపూజ చేయనున్నారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితతో పాటు రాయలసీమకు చెందిన పలువురు మంత్రులు హాజరుకానున్నారు. భూమి పూజకు రావాల్సిందిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కూడా ఆహ్వానించినట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కోరారు. మహానాడు లేఅవుట్ తయారు చేసి ఎక్కడెక్కడ, స్టేజీ ప్రతినిధుల సమావేశం కోసం ఏర్పాటు చేసే మీటింగ్ హాలు, గ్యాలరీలు, పార్కింగ్, సీఎం చంద్రబాబుకు బస వసతి, భోజనశాలలు, వీఐపీలకు ప్రత్యేక భోజనశాల, రక్తదాన శిబిరం, ఫొటో ఎగ్జిబిషన్ తదితరాలు ఆవిష్కరించనున్నారు.

కమిటీలు

ఇక మహానాడును సక్సెస్ చేసేందుకు సమన్వయం కోసం పలు కమిటీలను నియమించనున్నారు. వేదిక, ఆహ్వానం, వంట తదితరాల కోసం పలు కమిటీలను ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను చేయనున్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు

కడపలో నిర్వహించే మహానాడు చరిత్రలో నిలిచిపోనుంది. చివరి రోజున ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ జరగనున్నది. జగన్ ఐదేళ్లలో స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపనలు చేయడమే తప్ప దాన్ని పూర్తి చేయలేదు. జిందాల్‌తోనే స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేస్తాం.. ఒప్పందం కూడా జరిగిపోయింది. కడప జిల్లా సమగ్రాభివృద్ధికి ఓ ప్రత్యేక డిక్లరేషన్‌ను మహావేదికలో చంద్రబాబు ప్రకటిస్తారు. మహానాడు సక్సెస్‌తో వైసీపీ కోలుకోలేని విధంగా మారుతుంది.

- ఆర్.శ్రీనివాసరెడ్డి,
పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి

● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



బాధితుడి నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

కడప క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చిన వారికి చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. అనంతరం వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించేందుకు సహాయం చేశారు.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు : జేసీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అదితిసింగ్

కడప, కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని, ప్రజా సమస్యలు నిర్లక్ష్యం చేయవద్దని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో జేసీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను పరిశీలించి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా ఉండాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారాలుండాలని, అర్జీల పరిశీలనకు కింది స్థాయి అధికారులు వెళ్లకూడదన్నారు. అనంతరం అర్జీలను స్వీకరిస్తూ, వారి సాధక, బాధలు తెలుసుకుంటూ తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు సిఫార్సు చేశారు. కడప నగరం పాలెంపల్లికి చెందిన వెంకటసుబ్బమ్మ తనకు భర్త లేరని, జీవనాధారం లేదని, వితంతు పింఛన్ ఇప్పించాలని జేసీని అభ్యర్థించారు. తన అనుభవంలో సర్వే నెంబరు 347/ఏలో 18 సెంట్ల సాగుభూమిని పట్టాదారు పాస్‌బుక్‌లో ఎక్కించాలని తొండూరు మండలానికి చెందిన శివనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, మెప్మా పీడీ శ్రీనివాసులు, వెంకటపతి తదితర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు

● గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ



గజవాహనోత్సవంపై ఊరేగిన బ్రహ్మంగారి సమేత గోవిందమాంబ

బ్రహ్మంగారిమఠం, మే 5 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజు వేకువజాము నుంచే వీరబ్రహ్మ సుప్రభాతం, 8గంటలకు అభిషేకం, సహస్రనామార్చన, ఉదయం 10 గంటలకు భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబలు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 నుంచి భక్తులు క్యూలైనులో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 10 గంటలకు దేవాలయం ప్రాంగణంలో గజవాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబలు గుడి ఉత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ అలంకరణలో వెలుగొందింది.

పులివెందులలో నాటు.. ఘాటు



కల్లూరుపల్లె తాండలో బెల్లంఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు(ఫైల్)

● యథేచ్ఛగా నాటుసారా తయారీ

● సవాల్‌గా మారుతున్న సారా విక్రయాలు

● కదిరి నుంచి పులివెందులకు భారీగా దిగుమతి

● ఫొటోలకే పరిమితమైన నవోదయం

పులివెందుల టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంతో పాటు నియో జకవర్గ వ్యాప్తంగా నాటుసారా తయారీతో పాటు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు నవోదయం పేరుతో హంగామా చేస్తున్నారు తప్ప సారా జోరుకు అడ్డకట్ట వేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పులివెందుల పట్టణంతో పాటు కొన్ని మండలాల్లో నాటుసారా విక్రయాలు జోరుగా జరుగు తు న్నాయి. మరికొందరు సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతం నుంచి పులివెందులకు సారా దిగుమతి చేసుకుని విక్రయాలు జరుపుతుంటారు. వీరిపై ఎక్సైజ్ అధికారులు నిఘా పెడుతున్నా.. ఒకరు పట్టుబడితే మరొకరు విక్రయాలు సాగిస్తుండడంతో వారికి తల నొప్పిగా మారింది.

సారా తయారీ అయ్యే ప్రాంతాలు ఇవే...

పులివెందులలో నగరిగుట్ట, ఉలిమెల, ఎర్రిపల్లె, నల్లపురెడ్డిపల్లె ప్రాంతాల్లోనూ, చక్రాయపేట మండలం కల్లూరుపల్లె తాండ, వేముల మండలం రామిరెడ్డిపల్లె, నారేపల్లె గ్రామాల పరిధిలో నాటుసారా తయారీ విక్రయాలు జరుగుతుంటాయి. వీరికి తోడు కదిరి నుంచి నాటుసారా దిగుమతి చేసుకుని స్థానికంగా విక్రయాలు జరిపేవారు మరికొందరు. ఎక్సైజ్ పోలీసులు ఎంత నిఘా పెట్టి నాటుసారా తయారీ దారులను అరెస్టు చేసి.. వేల లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినా సారా దందా మాత్రం ఆగడం లేదు. తాండాల్లో తయారు చేసే సారాను సమీప గ్రామాలు, పట్టణాలకు తరలించి విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ లీటరు బాటల్‌ను రూ.100 నుంచి రూ.200లకు విక్రయిస్తారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న చీప్ లిక్కరు కంటే అతి తక్కువ ధరకే దొరుకుతుండడంతో ఆటో డ్రైవర్లు, కూలీ పనులకు వెళ్లేవారు, బేల్దారి పనులకు వెళ్లేవారు, మెకానిక్‌లు సారా మత్తుకు అలవాటు పడుతున్నారు.

ప్రకటనలకే పరిమితమైన నవోదయం 2.0

సారా నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలున్నాయి. పులివెందుల ప్రాంతంలో తయారీదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించకుండా ఉత్తుత్తి ప్రచారం చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు కేవలం ప్రభుత్వానికి నివేదికలు పంప డానికి ఫొటోల కోసమే హంగామా చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

దాడులపై ముందస్తు సమాచారం

సారా స్థావరాలపై దాడులు చేసే సమయంలో కొందరు ఎక్సైజ్ సిబ్బంది సారా తయా రీదారులకు ముందస్తు సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తయారీదారులు దాడులు జరిగే సమయానికి పరార్ అవుతున్నారు. కొందరు ఎక్సైజ్ పోలీసు అధికా రులకు మామూళ్లు అందుతుండడంతో సారా తయారీ, విక్రయదారులకు నామమాత్రంగా చర్యలు చేపట్టి వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి నాటు సారా నిర్మూలనకు చర్యలు చేప ట్టాల్సి ఉంది.

ప్రత్యామ్నాయ మార్గాలకు సిఫారసు చేస్తున్నాం



సారా తయారీ, విక్రయాలపై పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నాం. కొన్ని ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. ఎవరైతే సారా విక్రయాల్లో ఉన్నారో వివరాలు సేకరించాం, వారందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే విధంగా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నాం. సారా స్థావరాలపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తు న్నాం. నవోదయం 2.0 ద్వారా సారా తయారీదారుల్లో మార్పు తెస్తు న్నాం.

-చెన్నారెడ్డి, ఎక్సైజ్ సీఐ

రేపటి వైవీయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

కడప ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, ఒకేషనల్ 2, 4, 6 సెమిస్టర్లకు ఈ నెల 7న జరగాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు ఒక ప్రటనలో పేర్కొన్నారు. ఏపీఐసెట్ పరీక్ష ఉన్నందున ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వాయిదా వేసిన పరీక్షలను ఇదే నెల 23వ తేదీన నిర్వహిస్తామని వివరించారు.

నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● రూ.20 లక్షల విలువైన 23.4 తులాల బంగారం రికవరీ ● డీఎస్పీ భావన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ పి.భావన

ప్రొద్దుటూరుటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రూ.20 లక్షల విలువైన 23.4 తులాల బంగారాన్ని రికవరీ చేసినట్లు డీఎస్పీ భావన తెలిపారు. సోమవారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బొల్లవరం నరాల బాలిరెడ్డి కాలనీలో జరిగిన దొంగతనం కేసును ఛేదించేందుకు ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐలు ధనుంజయుడు, అరుణ్‌రెడ్డిలతో మూడు బృందాలు ఏర్పాటు చేసి దొంగతనం ఆచూకీ కోసం గాలించారన్నారు. ఇందులో కర్ణాటక బెల్గాంసిటీ వైభవ్‌నగర్‌కు చెందిన రఫీక్ సయ్యద్, అస్లాం, మహబూబ్ ఇబ్రహీంముల్లా, అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణం నక్కలదొడ్డికి చెందిన సయ్యద్ అక్బర్‌లు దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించామన్నారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు జమ్మలమడుగు రోడ్డు తిమ్మయ్య కాలనీలోని జమ్ములమ్మ గుడి వద్ద అనుమానాస్పదంగా ఉన్న వారిని అరెస్టు చేసి మధ్యవర్థుల సమక్షంలో విచారించి వారి నుంచి 23.4 తులాల ఆభరణాలను రికవరీ చేశామన్నారు. కర్ణాటకకు చెందిన ఖాజారఫిక్ సయ్యద్, అక్బర్‌లు 16 సంవత్సరాల వయస్సు నుంచే రాత్రిపూట చోరీలు వేయడం, నేరాలకు పాల్పడుతూ ఉండేవారని తెలిపారు. వారు కర్ణాటకకు చెందిన మరొక వ్యక్తితో కలిసి అదే ప్రాంతానికి చెందిన అర్మాన్ ఇర్ఫాన్, షేక్, మహబూబ్‌లను సహచరులుగా నియమించుకుని కర్ణాటకలో వివిధ నేరాలకు పాల్పడ్డారన్నారు. నలుగురిని అరెస్టు చేయగా మరో ఆచూకీ వ్యక్తిని కనుగొనాల్సి ఉందని తెలిపారు. దొంగతనాలు జరగకుండా పట్టణంలో పటిష్టమైన నిఘా ఉంచామని, పట్టణంలో ఇటీవల జరిగిన పలు చోరీలను త్వరలో ఛేదిస్తామన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇస్తే దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి, టుటౌన్ ఎస్ఐ ధనుంజయుడు, రూరల్ ఎస్ఐ అరుణ్‌రెడ్డి, ఏఎస్ఐ సుబ్బన్న, హెడ్‌కానిస్టేబుల్ బద్రారెడ్డి, కానిస్టేబుల్ దస్తగిరి, సుబ్రమణ్యం, రమణారెడ్డి, చాంద్‌బాష, ధనుంజయ, దినకర్, హోంగార్డు జనార్దన్‌రెడ్డిలకు రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామని తెలిపారు.

ఏడాదిగా ఎక్కడికక్కడే..

పులివెందుల వద్ద నిర్మిస్తున్న మెడికల్ కళాశాల పనులు ఏడాది కాలంగా ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. దాదాపు రూ.500కోట్లతో ప్రారంభించి రూ.380కోట్లు ఖర్చుచేసినా అసంపూర్తి పనుల కారణంగా ఇంకా వినియోగంలోకి రాని దుస్థితి. మరో రూ.120కోట్లు ఖర్చుచేస్తే మెడికల్ కళాశాల, ఆసుపత్రి వినియోగంలోకి రానున్నాయి. కానీ ఎప్పటికి ఈ పనులు పూర్తవుతాయో అన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలే అవకాశం కనిపిస్తోంది.



70శాతం పనులు పూర్తయిన ఐపీ భవనం

- నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులు
- రూ.380కోట్లు ఖర్చు చేసినా అసంపూర్తిగానే

పులివెందుల, మే 5 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంత ప్రజల కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.500కోట్లతో దాదాపు 25ఎకరాల్లో మెడికల్ కళాశాలతో పాటు అధునాతన ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2022లో ఈ మెడికల్ కళాశాల పనులు ప్రారంభించారు. ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. పనులు ఆది నుంచి కూడా వేగంగా సాగలేదని చెప్పాలి. పనులు ప్రారంభమై టెండర్ల దశలో, బిల్లులు కాక దాదాపు ఆరు నెలల పాటు పనులు ఆగిన పరిస్థితి ఇక్కడ నెలకొంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో మెడికల్ కళాశాల పనులు ఆగిపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ఆగిపోయాయని విమర్శలు రావడంతో మళ్లీ పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభించినప్పటికీ నిర్దేశించిన పనులు పూర్తికాలేదు. 2024 ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఆసుపత్రిని ప్రారంభించింది. మెడికల్ కళాశాలకు సంబంధించిన భవనాల నిర్మాణాలు పూర్తికాలేదు. కానీ ఆసుపత్రికి సంబంధించిన భవనాలు పూర్తయ్యాయని అప్పటి ముఖ్యమంత్రి చేత ప్రారంభించారు. ఆసుపత్రి భవనాలు కూడా పూర్తిస్థాయిలో నిర్మాణం కాలేదు. ఓపీ, ఐపీ, అత్యవసర సేవల విభాగాల భవనాలు కూడా పూర్తికాకపోవడంతో కాంట్రాక్టు సంస్థ దగ్గర నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు.

పూర్తి కాకుండానే ప్రారంభం

ఆసుపత్రికి సంబంధించిన ఓపీ విభాగం, ఐపీ విభాగం, అత్యవసర సేవల విభాగం ఇలా మూడు విభాగాలలో కూడా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఓపీ విభాగానికి సంబంధించి 80శాతం, ఐపీ విభాగానికి సంబంధించి 70శాతం, అత్యవసర సేవల విభాగానికి సంబంధించి 40శాతం పనులు పూర్తి అయినట్లు సమాచారం. మెడికల్ కళాశాల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. మెడికల్ కళాశాల భవనాలు అసంపూర్తిగానే ఉన్నాయి. కేవలం ఒక అంతస్తు స్లాబ్ పూర్తిచేశారు. మిగిలినదంతా పిల్లర్ల దశలోనే ఉంది. అలాగే విద్యార్థుల హాస్టల్, లైబ్రరీ భవనాలు కూడా పూర్తికాలేదు. ల్యాబ్‌ది అదే పరిస్థితి. ఇలా అన్ని పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ఇప్పటికి దాదాపు రూ.500కోట్ల పనులకుగాను రూ.380కోట్ల పనులు పూర్తయినట్లు ఓ అధికారి వెల్లడించారు. నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ ప్రభుత్వం నుంచి రూ.10 నుంచి రూ.20కోట్ల దాకా బిల్లులు రావాల్సి ఉందన్నారు.

ఏడాదిగా ముందుకు సాగని పనులు

2024 ఎన్నికలకు దాదాపు రెండు నెలల ముందు నుంచే పనులు నత్తనడకన సాగాయి. ఎన్నికల సమయానికి పనులు పూర్తిగా ఆగిపోయాయి. ఎన్నికలు అయిపోయి ఏడాది గడిచింది. అంటే ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ఈ పనులపై ఎటువంటి చర్య తీసుకోలేదు. ప్రస్తుతానికి ఈ భవనాల్లో ఓపీ, ఎమర్జెన్సీ విభాగాల్లో ఆసుపత్రి నడుపుతున్నారు. కేవలం ఆసుపత్రి నిర్వహణ చేపట్టడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మరో రూ.100 నుంచి రూ.120 కోట్లు ఖర్చుచేస్తే మెడికల్ కళాశాల ప్రారంభమవుతుంది. పులివెందుల ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రజలకు అధునాతన వైద్యం అందనుంది. ఏదిఏమైన పులివెందుల మెడికల్ కళాశాల పనులు ఏడాదిగా ఎక్కడి పనులు అక్కడే అన్నట్లున్నాయి.



పూర్తికాని హాస్టల్ భవనాలు



పిల్లర్ల దశలోనే మెడికల్ కళాశాల భవనం

ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీ మొసలి కన్నీరు

- వక్ఫ్ సవరణ చట్టంపై డబుల్ గేమ్ : తులసిరెడ్డి

వేంపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల పట్ల వైసీపీది మొసలి కన్నీరు, వక్ఫ్ సవరణచట్టంపై డబుల్ గేమ్ ఆడుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభలో వక్ఫ్ సవరణ చట్టానికి వైసీపీ వ్యతిరేకంగా ఓటు వేసిందని, కానీ రాజ్యసభలో అనుకూలంగా ఓటువేసి డబుల్‌గేమ్ ఆడిందన్నారు. పౌరసత్వ సవరణచట్టానికి కూడా బీజేపీకి అనుకూలంగా వైసీపీ ఓటు వేసిందన్నారు. బీజేపీ చేతిలో టీడీపీ, జనసేన, వైసీపీలు కీలుబొమ్మలన్నారు. అలాగే బీజేపీపుట్టక ముందే హిందూఅనే పదం వాడుకలో ఉందన్నారు. 1915లో హిందు మహాసభ, 1925లో ఆర్‌ఎస్‌ఎస్, 1951లో భారతీయ జనసంఘ్, 1964లో విశ్వహిందూ పరిషత్, 1980లో బీజేపీ పుట్టిందన్నారు. బీజేపీది నకిలీ జాతీయ వాదమని విమర్శించారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జమ్మలమడుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలో ఆదివారం ఇంటి వద్ద నుంచి వెళ్లి గూడెంచెరువు మాబు (72) అనే వృద్ధుడు విద్యుత్తు స్తంభానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గూడెంచెరువు మాబు ఆదివారం ఇంటి వద్ద నుంచి కనపడకుండా వెళ్లిపోయాడు. సోమవారం రాబడిన సమాచారం మేరకు దేవగుడి, సలివెందుల గ్రామాలకు వెళ్లినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి భార్య గత కొన్ని నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన ఆరోగ్యం సహకరించక అనారోగ్యానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గ్రామం శివార్లలో ఉన్న తన పొలంలోకి వెళ్లి విద్యుత్తు స్తంభానికి పంచెతో ఉరి వేసుకున్నాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మహబూబ్‌బాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

హోంగార్డుగా కారుణ్య నియామకం



నియామక పత్రం అందిస్తున్న ఎస్పీ

కడప క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎస్.రఘువర్మ (హెచ్‌జీ 486) సతీమణి కె.విజయమేరీకి కారుణ్య నియామకం కింద హోంగార్డుగా నియామకపత్రాన్ని ఎస్పీ అశోక్‌కుమార్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమని, పోలీసుశాఖ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీశైలరెడ్డి పాల్గొన్నారు.

క్లబ్ మూసేయాలని వైసీపీ నేత హల్‌చల్

పులివెందుల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓఎమ్‌సీ క్లబ్ మూసేయాలని వైసీపీ నాయకుడు కొమ్మా పరమేశ్వరరెడ్డి సోమవారం హల్‌చల్ చేశారు. లయోలా కళాశాల వద్దనున్న ఓఎమ్‌సీ క్లబ్ భవనం పైకి ఎక్కి క్లబ్ మూసేయకుంటే దూకుతానని మద్యంమత్తులో బెదిరించారు. క్లబ్బులో జూదమాడతున్నారని, మద్యం తాగుతున్నారని, దీనిని వెంటనే మూసేయాలని డిమాండ్ చేశారు. లయోలా కళాశాలకు విద్యార్థులు ఈ దారిలో వెళ్తుంటారని, వారికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. రంగప్రవేశం చేసిన పోలీసులు పరమేశ్వర్‌రెడ్డిని కిందికి దించి విచారించారు. తాగిన మత్తులో క్లబ్బును మూసేయాలని డిమాండ్ చేయడంతో పోలీసులు క్లబ్ మూసేయాలంటే విదివిధానాలు ఉంటాయని, అధికారులతో మాట్లాడాలని, అక్కడ నుంచి చెప్పి పంపించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

ముక్కావారిపల్లెలో చోరీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మహేష్

ఓబులవారిపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కావారిపల్లెలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఓ ఇంటిలో దొంగలు పడి బంగారు దోచుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు.. ముక్కావారిపల్లెలో కొత్త విజయమ్మ నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరులో ఉన్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు వారి ఇంట్లో చొరబడ్డారు. ఇంటి కిటికీ అద్దాలు పగులగొట్టి ఇనుప బీరువాను యంత్రాలతో కత్తిరించారు. బీరువాలో ఉన్న సుమారు 30 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. క్లూస్ టీం ద్వారా దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

మిద్దె పైనుండి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రాజశేఖర్

కడప క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): కడప నగరం రామాంజనేయపురంకు చెందిన పెయింటర్ ఓబులాపురం రాజశేఖర్ (50) ఆదివారం సమీప ప్రాంతంలోని ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. కలసపాడు మండలం చెన్నారెడ్డిపల్లె దళిత కాలనీకి చెందిన రాజశేఖర్ పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పిల్లలతో కలిసి కడప రామాంజనేయపురంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం పెయింట్ పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి కాలుజారి కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన నేపాల్

మదనపల్లె అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఆస్పత్రి అవుట్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు రాజస్థాన్‌కు చెందిన ఈర్‌సింగ్, అతని కుమారుడు నేపాల్ (18) కొన్నేళ్లుగా మదనపల్లె పట్టణం ఆర్‌ఆర్ వీధిలో ఫ్యాన్సీస్టోర్ నిర్వహిస్తున్నారు. ఆదివారం షాపు సెలవు కావడంతో నేపాల్ మద్యం సేవించాడు. సోమవారం ఉదయం నుంచి వాంతులు చేసుకుంటుండడంతో సాయంత్రం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్దిసేపటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య



చిన్నారి మృతదేహం

కలకడ, మే 5 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్‌లో మియాపూర్ బొల్లారం ప్రాంతానికి చెందిన మణి మండలంలోని కోన గ్రామంలో వున్న క్వారీలలో రాయి కొట్టడానికి కూలీగా వచ్చాడు. ఎర్రయ్యగారిపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకుని తన భార్య చిన్నారి (19)తో కలసి కాపురం ఉంటున్నాడు. ఆదివారం మద్యం సేవించి ఇంటికి వెళ్లడంతో ఇద్దరు గొడవ పడ్డారు. ఈ సోమవారం వేకువజామున మణి నిద్రలేచి పనులకు వెళ్లగా, చిన్నారి ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

హత్య కేసులో ఏడుగురు అరెస్టు

వేంపల్లె, మే 5(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ కాలనీలో జరిగిన ఘర్షణలో కత్తి శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి కడప రిమ్స్‌లో మృతిచెందిన ఘటనలో హత్య కేసు నమోదైంది. ఈ హత్య కేసులో ఉన్న నిందితులు ఎం.వెంకటేశ్, వి.వెంకటేశ్వర్లు, అంజితో పాటు ఏడుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని, నిందితులను జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

వేంపల్లె పట్టణంలో సీఐ ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని, ఇస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పలువురు యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్
- పదో తరగతిలో టాప్-10 విద్యార్థులకు సన్మానం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో కలెక్టర్, ఎస్పీ, డీఈవో తదితరులు

కడప ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రణాళికాబద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. సోమవారం నగర శివారులోని శిల్పారామంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల టాప్-10 విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్‌లు హాజరయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన మొదటి పది మంది విద్యార్థులను కలెక్టర్, ఎస్పీ సన్మానించి మెమెంటోలు అందించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆత్మీయ విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో సాధారణ విద్యార్థిని కూడా ఉపాధ్యాయులు విజయవంతమైన స్థాయిలో నిలుపగలరన్నారు. జిల్లాలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర పోషించారని, ఈ సందర్భంగా వారిని అభినందించారు. జిల్లాలోని సింహాద్రిపురం మండలం రావులకొలను జడ్పీ హైస్కూల్‌కు చెందిన జోషిక పల్లేటి అత్యధికంగా 595 మార్కులు, సిద్దవటం మండలం జడ్పీ హైస్కూల్‌కు చెందిన అతికారి పల్లవి 594, పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జడ్పీ హైస్కూల్ నీలం నాగవీరతరుణ్ 593, కాశినాయన మండలానికి చెందిన ఏపీమోడల్ స్కూల్ బండి రామసాయి విగ్నేష్ 593, వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థి రుద్ర గంగా జశ్వంత్‌రెడ్డి 592, బద్వేలు మండలానికి చెందిన అతికారి రక్షిత 591, జమ్మలమడుగు మండలం ఎంజేపీఏపీబీసీ డబ్ల్యూఆర్‌ఎస్ (బాలుర) గంజికుంట వెంకట శివసంతోష్ 591, వేముల మండలానికి చెందిన జడ కార్తీక్ 590, జమ్మలమడుగు మండలానికి చెందిన కొట్టం జువేరియ తహసీన్ 590, తొండూరు మండలానికి చెందిన ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు) గంజికుంట తన్మయి 589 మార్కులు సాధించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ షంషుద్దీన్ ప్రసంగించారు. కాగా రామకృష్ణ మిషన్, విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ నిత్యానందరాజు, ఇతర జిల్లా అధికారులు, డిప్యూటీ డీఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయనపల్లె ప్రభుత్వ భూముల పరిశీలన

- భూ ఆక్రమణపై జేసీకి నివేదిక సమర్పించిన తహసీల్దారు



ఆక్రమణ భూములను పరిశీలిస్తున్న జేసీ అదితి సింగ్

కాశినాయన, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయనపల్లె గ్రామ సమీపంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్‌తో కలిసి పరిశీలించారు. అక్కడ ఉన్న కొండ పోరంబోకు భూములను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ 128, 129(1), 130, 217 సర్వే నెంబర్లలో ఎంతెంత భూమి ఆక్రమణకు గురైందనన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ భూములు ఆక్రమించుకున్న వారికి ఎక్కడెక్కడ భూములున్నాయి, వారికి నోటీసులు ఇచ్చారా తదితర అంశాలపై ఆరా తీశారు. ఇందులో సర్వే నెంబర్ 128లో 0.28 సెంట్లు, 129(1)లో 82.85 ఎకరాలు, 130లో 83.18 ఎకరాలు, 217లో 128 ఎకరాలను 63 మంది రైతులు ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అనంతరం ఈ భూ ఆక్రమణలపై సమగ్ర నివేదికను జేసీకి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

12న వైఎస్ షర్మిల రాక

కడప కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 12వ తేదీన కడపకు రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడపలో జరిగే సమావేశంలో నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, డీసీసీ ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, ప్రసాద్‌గౌడ్, మామిళ్ల బాబు, సంజయ్ కాంత, తదితరులు పాల్గొన్నారు.

వలసపాలెం వాసి కువైట్‌లో మృతి



గంగాధర్ ఫైల్‌ఫొటో

అట్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు గ్రామ పంచాయతీ వలసపాలెం గ్రామానికి చెందిన కేతవరం గంగాధర్ (38) కువైట్‌లో పదిరోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు. గంగాధర్ ఐదు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లాడు. అప్పటి నుంచి వస్తూపోతూ ఉండేవాడని బంధువులు తెలిపారు. కువైట్‌లో బిల్డింగు పనులు చేసేవాడని, అతను ఉన్న రూములో తోటి మిత్రులకు వంట చేసి బయటికి వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లాడని, పోయినవాడు రాకపోవడంతో పోలీసుల చెకింగ్ లో పట్టుబడి జైల్లో వేశా రేమోనని అనుమానం వ్యక్తం చేశారన్నారు. పదిరోజుల తరువాత ఫర్వానియా ఆసుపత్రి నుండి ఇండియా ఎంబసీకి ఫోను చేసి మృతుడి గుర్తింపు కార్డు ప్రకారం వివరాలు తెలుపగా అట్లూరు పోలీసుస్టేషనుకు సోమవారం ఇండియా ఎంబసీ ఫోను చేశారని బంధువులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఫోను చేసి విషయం తెల పడంతో మృతి చెందినట్లు డిక్లేర్ అ యింది. మృతదేహం రెండు మూడు రోజుల్లో స్వగ్రామానికి వస్తుందని తెలిపారు. మృతుడికి భార్య సావిత్రమ్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలి

- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి



చెన్నూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వారి కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఎల్లవేళలా పాటుపడాలని సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి సహదేవరెడ్డి అన్నారు. చెన్నూరు ఎంపీఎస్‌ఆర్ కన్వెన్షన్ హాలులో సోమవారం రెండురోజుల పాటు జిల్లాస్థాయి శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా దక్షిణ భారత సంఘటన అధ్యక్షుడు (ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక) దోనూరు రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా సహదేవరెడ్డి మాట్లాడుతూ రైతులకు పంటలసాగులో ముఖ్యంగా విద్యుత్, విత్తనాల సమస్య, ఎరువులు వంటి ఎలాంటి సమస్యలు తలెత్తినా బీకేఎస్ ఆధ్వర్యంలో తక్షణం స్పందించి ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. బీకేఎస్ అంటేనే రైతుల అభివృద్ధికి, సంక్షేమానికి మారు పేరు అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండబాబు, శ్రీపతిరాజు, మహేశ్వర్‌రెడ్డి, ఆశాకిరణ్, బీకేఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, జనార్ధనరెడ్డి, కడప, అన్నమయ్య, చిత్తూరు. తిరుపతి, నెల్లూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం సత్యసాయి జిల్లాల కిసాన్ సంఘ నేతలు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

ములకలచెరువు, మే 5(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో సోమవారం దాడులు నిర్వహించి నాటు సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మాధవి తెలిపారు. మండలంలోని గోఆపోతులపల్లె సమీపంలో నాటు సారా వండుతున్న శ్రీనునాయక్, జయమ్మలను అరెస్టు చేసి వారి నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం
యువత సద్వినియోగం చేసుకోవాలి

కడప ఎర్రముక్కపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాసాపేట శివ పిలుపునిచ్చారు. సోమవారం కడప నగర మాసాపేట టీఎన్ఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకుంటున్న ఒప్పందాలతో యువతకు అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్, నగర అధ్యక్షుడు అనిల్, పార్ల మెంట్ మీడియా కోఆర్డినేటర్ విశ్వనాథ్, జిల్లా కార్యదర్శి వినయ్ పాల్గొన్నారు.

డీఎస్సీ - 2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం 2021లో జారీ చేసిన సెంట్రల్ గవర్నమెంట్ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓల్డ్ పెంచన్ స్కీమ్ అమలు చేయాలని 2003 డీఎస్సీ ఫోరం జిల్లా కన్వీనర్ గుజ్జుల తిరుపాల్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం ఎర్రముక్కపల్లె పీఆర్‌టీయు జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 7వ తేదీ బుధవారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమావేశం కడపనగరం రాజారెడ్డి వీధి ఎస్టీయు భవన్‌లో ఉదయం 9గంటల నుంచి సమావేశం ప్రారంభమవుతుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులు ఉదయం బాస్కర్, వీరప్రతాప్, అయ్యవారురెడ్డి, గంగాధర్, నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవచూపండి

కడప మారుతీనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేలా ప్రత్యేక చొరవచూపాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు టి. జయరామ్, ఎస్. శ్రీనివాసులు కోరారు. ఎన్ఎంయూ కడప డిపో ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పాత కలెక్టరేట్ సమీపంలో గల ఆర్డీఓను ఆయన కార్యాలయంలో వారు కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను డిపో, జిల్లా, జోన్, రాష్ట్ర స్థాయి సంబంధిత అధికారుల దృష్టికి గత 6నెలలకు పైగా విన్నవించినప్పటికీ స్పందించక పోగా పైపెచ్చు కక్ష సాధింపు చర్యల కు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కడప డిపో ఎన్ఎంయూ నాయకులు పి.ఎస్.ఖాన్, జబ్బార్, రామచంద్ర, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన దళిత,గిరిజనులకు వ్యవసాయ భూమి ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

కడప మారుతీనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్వంత భూములు లేని నిరుపేద దళిత, గిరిజనులకు జీవనాధారంగా చింతకొమ్మదిన్నె మండలంలో గల ప్రభుత్వ వ్యవసాయ భూములు ఇవ్వాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. 2021లో అప్పటి కలెక్టర్ సి.కె.దిన్నె మండలంలోని దళిత, గిరిజనులకు వ్యవసాయానికి అనువైన భూములివ్వాలని ఎంక్వయిరీ చేయించి అర్హుల జాబితాను తయారు చేయించారన్నారు. కాగా ఇప్పటికీ భూములు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్న తీరు సరైందికాదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్, పలువురు సి.కె. దిన్నె దళిత, గిరిజనులు పాల్గొన్నారు.

వెయ్యినూతులకోన ఆలయంలో ప్రత్యేకపూజలు



కలశ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

పెండ్లిమర్రి, మే 5 (ఆంధ్ర జ్యోతి):వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వెయ్యి నూతులకోన ఆలయంలో విష్వక్సేనారాధనను అర్చకులు నిర్వహించారు. ఉదయాన్నే వేద పారాయణం,యాగశాల ప్రవేశం, ద్వారా తోరణ, అగ్నిమథనం సాయంత్రం చతుస్థానార్చన నిర్వహించారు.భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని వేదపారాయణంలో పాల్గొన్నారు.

పుత్తాను పరామర్శించిన టీడీపీ నాయకులు



కమలాపురం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి ఇటీవల హైదరాబాదులోని ఓ హాస్పిటల్‌లో మోకాళ్లకు శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాదులో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కొండాయపల్లె టీడీపీ యువ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆయనను పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పెద్దచెప్పలి ఆర్ఎంపీ డాక్టర్ తిరుమలేశ్, పెద్దచెప్పలి నాగరాజు, పుత్తారమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పీజీ చదవాలనుకునే పేద విద్యార్థులకు గుదిబండలా మారిన జీఓ 77ను రద్దు చేసి, ఆ తర్వాతే ఈ ఏడాది ఐసెట్‌ను నిర్వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యాసమితి సభ్యులు హనీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం యోగివేమన యూనివర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూనివర్సిటీ ఉపాధ్యక్షులు పుల్లయ్య, అరుణ్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో చెత్తకుప్పలు..!



కలెక్టరేట్‌లోని డి-బ్లాక్ వద్ద పేరుకుపోయిన చెత్తచెదారాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో చెత్త దిబ్బలు పేరుకుపోతున్నాయి. కలెక్టరేట్‌లోని డి-బ్లాక్ ఎదురుగా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని రోజులుగా పలు వాహనాలను నిలిపి ఉంచారు. వాటి పక్కన చెత్త, చెదారం పేరుకుపోయింది. అది చాలదన్నట్లు కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలు, ప్రాంతంలోని చెత్తనంతా తీసుకువచ్చి డి-బ్లాక్ ఎదురుగా పడేస్తున్నారు. ఈ బ్లాక్‌లో డీఆర్‌డీఏ, డ్వామా, చేనేత, ఐసీడీఎస్, మెప్మా కార్యాలయాలతో పాటు ఎస్సీ, ఓబీసీ, మైనారిటీ కార్పొరేషన్లు, సంక్షేమ కార్యాలయాలు ఉన్నాయి. ఒక పక్కన సర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర నినాదంతో పరిసరాల పరిశుభ్రత పాటించాలంటూ జిల్లా అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. శ్రమిస్తున్నారు. కానీ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా ఇక్కడి పరిస్థితి తయారవుతోంది. గతంలో కూడా ఇదే పరిస్థితి ఉంటే ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. కొంత వరకు పరిసరాలను శుభ్రం చేశారు. కానీ అక్కడక్కడ కార్యాలయాల వద్ద కూడా చెత్తా చెదారం పేరుకుపోతోంది. డి-బ్లాక్ వద్ద పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతినెలా, ప్రతి కార్యాలయం నుంచి కొంత మొత్తాన్ని వసూలు చేసి పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత డీఆర్‌డీఏ తీసుకుంది. ఆశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న పరిస్థితి కనిపించడం లేదనేది స్పష్టమవుతోంది. పత్రికల్లో వచ్చినపుడు మాత్రమే అధికారులు హడావిడి చేయడం జరుగుతోంది.

నేడు మండల మీట్

వీరపునాయునిపల్లె,మే 5 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం భవనంలో ఉదయం 10గటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులలు హాజరుకావాలని తెలిపారు.

నిస్సీ 20వ వార్షికోత్సవ పోస్టరు విడుదల

కమలాపురం రూరల్, మే 5 (ఆంధ్ర జ్యోతి) : నగర పంచాయతీలో నిస్సీ ఆశీర్వాద పండుగ సభలను విజయవంతం చేయాలని పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుదాస్ తెలిపారు. సోమవారం నిస్సీ చర్చి 20వ వార్షికోత్సవ సభల పోస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్సీ చర్చి 20వ వార్షికోత్సవ సందర్భంగా స్వస్థత ప్రార్థన సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 12, 13, 14, 15, 16తేదీల్లో నిస్సీ ఆశీర్వాద పండుగల సభలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం పాస్టర్స్ పాల్‌కుమార్, రాజేశ్, విజయ్, సామ్యేల్, విజయశేఖర్, హెప్సిబా పాల్గొన్నారు.

కనీసవేతనం సవరించండి

కడప సెవెన్ రోడ్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లోని కార్మికుల కనీస వేతనాలను రూ.35వేలకు సవరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ అనేక పరిశ్రమల్లో కనీస వేతనాలను 7 నుంచి 12 ఏళ్లుగా పెంచలేదని ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కష్ట జీవులు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. ధర్నా అనం తరం స్పందనలో డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడుకి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయ కులు మద్దిలేటి, లింగన్న, నరసింహులు, జాన్ వెంకటద్రి, మేలింగి రాజశేఖర్, ఈశ్వరయ్య, ఆశావర్కర్స్‌యూనియన్ నాయకులు, ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక నాయకులు, అంగన్వాడీ వర్కర్స్‌యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కడప సెవెన్ రోడ్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ఏపీకార్ల్‌లో పనిచేస్తున్న 25 మందిని అకారణంగా తొలగించిన సీఈఓపై చర్యలు తీసుకొని కార్మికులను విధుల్లోకి తీసు కోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శ మనోహర్ కోరా రు.జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కి సీఐటీయూ ఆధ్వర్యం లో వినతిపత్రం అందించారు.సీఐటీయు నగ ర అధ్యక్షుడు చంద్రారెడ్డి,నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలి..: ఎర్రగుంట్ల మండల పరిధిలోని జువారి సిమెంట్ యాజమాన్యం మైన్స్ బ్లాస్టింగ్ చేయడం వల్ల దెబ్బతిన్న వలసపల్లె గ్రామం, దళిత కాలనీ ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.

మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి..: రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్మిన ఎరువుల డబ్బులు రూ. 32 లక్షలు ఎగరగొట్టిన రైతు సేవా కేంద్రాలు, వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో జేసీకి వినతిపత్రం అందించారు.

స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించబోయే డీఎస్సీ పరీక్షకు స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టెట్ నిబంధనలను తొలగించి నేరుగా నియామకాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం



కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టేట్‌బ్యాంకు కాలనీలో పనులను సోమవారం ప్రారం భించారు. స్టేట్ బ్యాంకు కాలనీ నుంచి మహిళా ప్రాంగణం వరకు రూ.50లక్షల వ్యయంతో చేపట్టే రోడ్డు పనులను నెలల తరబడి పూర్తి చేయకుండా కాంట్రాక్టరు నిర్లక్ష్యం వహించడంపై ఆంధ్రజ్యోతి ఈ నెల 4న నత్తే నయం.. అనే శీర్షికన వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో నగరపాలక సంస్థలోని ఇంజనీరింగ్ సిబ్బంది కాంట్రాక్టరుపై వత్తిడి తీసుకువచ్చి పనులను ప్రారంభించారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, మే 5 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియమాలపై యువత అవగాహన పెంచుకోవాలని కడప ట్రాఫిక్ సీఐ జావెద్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని తెలుగుగంగ కార్యాలయం ఆవరణంలోని ఎన్‌సీసీ క్యాంపు వద్ద సోమవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దేశభవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని, చట్టాలపై, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, దాదాపు 200 మంది ఎన్‌సీసీ స్టూడెంట్లు పాల్గొన్నారు.

నారాలోకేశ్‌ను కలిసిన లక్ష్మీరెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను సోమవారం ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27, 28, 29వ తేదీలలో కడపలో జరిగే మహానాడు కార్యక్రమం కడపలో ఏర్పాటుచేయడం శుభపరిణామమని తెలిపారు. మహానాడుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని నారా లోకేష్‌తో వివరించామని తెలిపారు. మహానాడు కార్యక్రమంలో ఏ బాధ్యత అప్పగించినా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు

కడప ఎర్రముక్కపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 7వ డివిజన్ శంకరాపురం గుర్రాల మిద్దె వీధిలో రూ.16లక్షల వ్యయంతో సిమెంటురోడ్డు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు కడప ఎమ్మెల్యే మాధవి సోమవారం సీసీరోడ్డు, రైల్వే నిర్మాణాలకు సంబంధించిఆమె భూమిపూజ చేశారు. ప్రజల అవసరాలనుదృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడితే చర్యలు : ఎమ్మెల్యే మాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తేచూస్తూ సహించేది లేదని హెచ్చరించారు. సోమవారం నగరంలోని ద్వారకానగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎవరికైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరు కబ్జాలకు పాల్పడిన తన దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక సెంటు భూమిని ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్,మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాష డిమాడ్ చేశారు. సోమవారం కడప నగరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వ అధ్యక్షుడు గురయ్య, జిల్లా కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు, సీకెదిన్నె అధ్యక్షుడు సుబ్బారెడ్డి, అట్లూరు అధ్యక్షుడు మస్తాన్‌బాబు, మణి, సిద్దవటం బాధ్యులు నరసింహబాబు, జిల్లా కౌన్సిలర్లు శివయ్య, నాగన్న పాల్గొన్నారు.

రీసర్వేను పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీవో

చెన్నూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివాలపల్లె గ్రామ పంచాయతీలో సావిత్రి రీసర్వే కార్యక్రమాన్నిడిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు సోమవారం పరిశీలించారు. సిబ్బంది చేపడుతున్న కొలతలు, రీసర్వేవ తనిఖీ చేశారు. కార్యక్రమంలో రీసర్వే సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదిగినా ప్రజాసేవ మరిచిపోవద్దు



శ్రీకాంత్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : సివిల్స్‌లో ర్యాంకు సాధించేందుకు ఏ విధంగా కష్టపడ్డావో ఉద్యోగంలో చేరిన తరువాత ప్రజాసేవ కోసం అంతకు రెట్టింపు కష్టపడి ప్రజల మన్ననలు పొందాలని ర్యాంకర్ నేలటూరు శ్రీకాంత్ రెడ్డిని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అభినందించారు. సోమవారం రాత్రి చెన్నూరులోని శ్రీకాంత్‌రెడ్డి ఇంటికి ఎమ్మెల్యే రావడం జరిగింది. అలాగే శ్రీకాంత్‌రెడ్డికి బొకే ఇచ్చి శాలువాతో సన్మానించి వెంకటేశ్వరస్వామి ప్రతిమ అందించారు. అలాగే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, పొట్టిపాటి హనుమాన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, షబ్బీర్‌హుసేన్, వీరారెడ్డి, ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమమైనింగ్‌పై పట్టించుకోని అధికారులు

వేంపల్లె, మే 5 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె, వేముల మండలాల్లో అక్రమ ముగ్గురాయి తవ్వకొని తరలించుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ తెలిపారు. వేంపల్లెలో బీజేపీ నాయకులతో కలిసి సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వం సహజవనరులైన ముగ్గురాయిని ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్నారని, వాటిని అరికట్టే అధికారయంత్రాంగం పూర్తిగా విఫల మైందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, మండల శాఖ ప్రతినిధులు ఈశ్వరరెడ్డి, ప్రసాదరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

60ఏళ్లు నిండిన కార్మికులను కొనసాగించాలి
సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్



కార్పొరేషన్ ఎదుట నిరసన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, మే (ఆంధ్రజ్యోతి): అరవై ఏళ్ల నిండిన కార్మికులను తొలగించకుండా యథావిధిగా కొనసాగించాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మేయర్ సురేష్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. మేయర్ స్పందించి స్టాండింగ్ కమిటీలో కార్మికులకు అనుకూలంగా తీర్మానం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ ఉపాధ్యక్షుడు తిరుపాల్, నగర అధ్యక్షుడు రవి,నగర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు,కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కేసీ కాలువలో నీటి మొక్కలు తొలగించేదెప్పుడు..?



శివాలపల్లె వద్ద సగం కాల్వ పొడవునా పెరిగిన మొక్కలు



చెన్నూరు వద్ద కేసీ ఉప కాల్వ నిండా పెరిగిన తీగ జాతి మొక్కలు

చెన్నూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో కేసీ ప్రధాన కాల్వతో పాటు ప్రధాన ఉప కాల్వ సైతం పలు రకాల నీటి మొక్కలతో నిండిపోయింది, ఏటా వేసవిలో ఈ ప్రధాన కాల్వను ఉప కాల్వలను శుభ్రం చేయిస్తే ఈ సమస్య ఉండదు. మూడేళ్లకో, నాలుగేళ్లకోమారు కాల్వలు శుభ్రం చేస్తే పై నుంచి కొట్టుకువచ్చిన మొక్కలు కాల్వల్లో నిలిచి పోయి విపరీతంగా అల్లుకుంటున్నాయి. దీంతో నీటి ప్రవాహానికి ఇబ్బందిగా కూడా ఉంటుంది. తీగ జాతి మొక్కలు కేసీ ప్రధాన కాల్వలో శివాలపల్లె, గోపవరం, ఉప్పరపల్లె, శేషయ్యగారిపల్లె, చిన్నమాచుపల్లె, లాకర్స్ ఆలంఖాన్‌పల్లెలాంటి చోట్ల విపరీతంగా పెరిగి ఉంది. అలాగే చెన్నూరు వైపు వచ్చే ప్రధాన కాల్వ సైతం కొత్తరోడ్డు నుంచి సారవల వరకు కాల్వ అంతా తీగ జాతి మొక్కలతో నిండి కాల్వ రూపురేఖలే కనిపించలేదు. కాల్వల్లో నీరు తగ్గితే ఉపాధి పథకంలో అయినా కాల్వ మొత్తం పూడిక తీసేస్తే ఈ తీగజాతి మొక్కలు లేకుండా చేయవచ్చని రైతులు అంటున్నారు.

తూనికలు, కొలతలలో మోసాలను ఉపేక్షించం



పి.జయదేవ్
తూనికలు, కొలతల శాఖ
ఇన్‌స్పెక్టర్, ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను తప్పక పాటించాలని తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జయదేవ్ అన్నారు. ప్యాక్ చేసిన తినుబండారాలపై మ్యానుఫ్యాక్చరింగ్ డేట్, ఎమ్మార్పీ, ఎక్స్పైర్‌డేట్, కస్టమర్ కేర్ లాంటివి తప్పని సరిగా పరిశీలించిన పిదప వినియోగదారులు కొనాలన్నీ 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: తూనికలు, కొలతల విభాగంలో ప్రధాన బాధ్యతలు ఏమిటి ?

జవాబు: ప్రతి కాటాను, తక్కెడ, ఎలక్ట్రానిక్ కాటా, కౌంటర్ మిషన్ పరికరాలను తప్పనిసరిగా ప్రమాణాలు పాటించేలా చూస్తామన్నారు.

ప్రశ్న: తూనికలు కొలతల మోసాలపై దృష్టి సారించే చట్టాలు ఏమిటి ?

జవాబు: సెక్షన్ 8/25 ప్రకారం తూనికలు కొలతల శాఖ యాక్ట్ 2009 ప్రకారం అపరాధ రుసుము వసూలు చేస్తాం. అలా చెల్లించని వారిని కోర్టుకు పంపుతాం.

ప్రశ్న: ప్రజలు అన్యాయానికి గురయ్యారని అనుకుంటే ఎలా ఫిర్యాదు చేయవచ్చు?


జవాబు: నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1915 కు మోసపోయిన వినియోగదారులు కంప్లైంట్ చేయవచ్చు. స్థానికంగా ఉండే తూనికలు కొలతల శాఖ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న: సాంకేతిక ప్రగతితో పరిశీలనలో ఎలాంటి మార్పులు చేశారు?

జవాబు: గతంతో పోల్చుకుంటే సాధారణ తక్కెడలు ఉన్నప్పుడు అధికంగా మోసాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం అధిక సంఖ్యలో ఎలక్ట్రానిక్ కాటాలను వాడుతున్న తరుణంలో మోసాలు తగ్గుముఖం పట్టాయి.

మట్టికుండలకు మంచిరోజులు

● ఫ్రిజ్‌లు ఉన్నా మట్టికుండల వైపు జనం చూపు ●ఆరోగ్యానికి శ్రేష్ఠమంటూ వాడుతున్న కుండలు ● ఊపందుకున్న విక్రయాలు





బద్వేలుటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలు మండుతుండడంతో చల్లని తాగునీటి కోసం జనం మట్టికుండలను వాడుతున్నారు. ప్రతి ఇంటా ఫ్రిజ్‌లు ఉన్నప్పటికి ఆరోగ్య రీత్యా మట్టికుండలు మేలంటూ జనం ఆ దిశగా ముందుకె ళుతున్నారు. మట్టికుండ.. ఒకప్పుడు లేని ఇళ్లు ఉండేది కాదంటే అతిశయోక్తికాదు. నీరు పట్టుకోవడానికి.. నీటిని నిల్వ ఉంచడానికి.. వంటలకు.. ఇలా అన్ని అవసరాలకు వాటిని వినియోగించేవారు. వంట పాత్రలను కూడా మట్టిపాత్రలనే వాడేవారు. కాలక్రమేణ వాటి ఉపయోగం తగ్గుతూ వచ్చింది. అయితే ఇటీవల కాలంలో ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాలే కాకుండా పట్టణ ప్రాంతాల వారు సైతం మట్టికుండలను తాగునీటి కోసం వాడుతుండడంతో వాటి వినియోగం పెరిగి మట్టికుండలకు మంచిరోజులు వచ్చాయని పేర్కొంటున్నారు. మట్టికుండల్లో నీరు తాగి తే ఎంతో మేలు చేకూ రుతుందని వైద్యనిపుణులు పేర్కొంటుండడం ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తోంది. గొంతునొప్పి, జలుబు ఇతరత్రా వ్యాధులను నివారించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. చిన్న పట్టణాలతోపాటు పెద్ద పెద్ద నగ రాల్లో కూడా మట్టికుండలు, కూజాల విక్రయాలు పెరుగుతున్నాయి. ప్రస్తుత అవసరాలు, మా ర్యులకు తగ్గట్టుగా మట్టికుండలకు నీటి కొళాయిలు బిగించి విక్రయిస్తుండడం గమనార్హం. ఒక్కొక్క కుండలో 10, 20, 30 లీటర్ల నీటి సామర్థ్యంతో ఉంటాయి. మట్టికుండలు రూ.200 నుంచి రూ.500 వరకు మార్కెట్లో ధరలు పలుకుతున్నాయి. అలాగే ఆలయ నిర్మాణంలోని విగ్రహ ప్రతిష్ఠకు ముంతలను అధికంగా వినియోగిస్తుండటంతో మట్టికుండలకు గిరికీ అదరోహో అనిపిస్తోంది.



చక్రంపై కుండలు తయారు చేస్తున్న దృశ్యం

కుండనీరే శ్రేష్ఠం



ప్రతి సంవత్సరం వేసవిలో తప్పనిసరిగా తాగునీటి కోసం కొత్త కుండలను కొనుగోలు చేస్తాం. 20సంవత్సరాలుగా కుండనీరే తాగుతుండటంతో దాహం తీరడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటున్నాం.

-దర్శి సుబ్బరాజు. స్థానికుడు

ఆరోగ్యానికి మంచిది



మట్టికుండలో నీటిని తాగడం ఆరోగ్యానికి మంచిది. ఫ్రిజ్‌కంటే మట్టికుండ లోని నీరే ఆరోగ్యానికి మేలు. పూర్వం మట్టిపా త్రలనే వినియోగించేవారు. ప్రజలు మట్టికుండలకు ప్రాధాన్యమివ్వడం శుభపరి ణామం.

-సుబ్బారెడ్డి, ప్రభుత్వాసుపత్రి సూపరెంటెండెంట్

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



తహశీల్దార్ కు వినతి అందిస్తున్న యూనియన్ నాయకులు

మైదుకూరు రూరల్ ,మే 5(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు ఎన్‌యంయూ నాయకులు సోమవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ మైదుకూరు తహశీల్దార్ రాజసింహ నరేంద్రకు వినతి పత్రం అందజేశారు. అనంతరం డిపో సెక్రటరీ రాయుడు మాట్లాడుతూ ఏపీఎస్‌ఆర్‌టీసీ ఎన్‌ఎంయూ రాష్ట్ర పిలుపు మేరకు మైదుకూరు డిపో వద్ద నిరసనలు తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాయుడు,కొండయ్య, రావు షరీఫ్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ నిరసనలో భాగంగా తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డికి, ఎంపీడీవో రమణారెడ్డికి ఏపీటీఎఫ్ నేతలు సత్తార్, క్రిష్టారెడ్డి వినతిపత్రం అందించారు.

కమనీయం.. అగస్త్యేశ్వరస్వామి కల్యాణం



గంగాగౌరీ అగస్త్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం గంగాగౌరీ, అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన నియోజకవర్గ కోఆర్డినేటర్లు



ప్రొద్దుటూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కడపజిల్లా నియోజకవర్గ కోఆర్డినేటర్లు సోమవారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిలను కలిశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని సమస్యలపై సుదీర్ఘంగా ఆమె చర్చించారని, సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ కోఆర్డినేటర్ ధృవకుమార్‌రెడ్డి, జమ్మలమడుగు కోఆర్డినేటర్ శివమోహన్‌రెడ్డి, కమలాపురం కోఆర్డినేటర్ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలసపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఎంపీడీఓ మహబూబ్‌బి తెలిపారు. మూడు స్లాబ్‌ల కింద మొత్తం 14 యూనిట్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. మొదటి స్లాబ్ కింద 11 యూనిట్లకు ఒక్కొక్కరిక లక్ష రూపాయలు, రెండవ స్లాబ్ కింద రెండు యూనిట్లు మూడు లక్షల రూపాయల చొప్పున, మూడవ స్లాబ్ కింద ఒక యూనిట్‌కు రూ. 5లక్షలు చొప్పున బబ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 25లోపు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

బద్వేలులో ఉచిత వడుగుల కార్యక్రమం

బద్వేలు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) :స్థానిక ఫాతిమా మసీదులో మసీద్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ మేనేజ్‌మెంటు ఆధ్వర్యంలో సోమవారం మసీద్ ఆవరణలో సుమారు 200 మంది బాలురకు ఉచితంగా వడుగుల కార్యక్రమం నిర్వహించారు. గత 20 సంవత్సరాలుగా ఉచిత వడుగుల కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. వడుగులు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామ న్నారు. మసీదు కమిటీ అధ్యక్షులు హుసేన్‌పీరా, షేక్ మహబూబ్‌బాషా, హుసేన్‌సాబ్, సద్దాం, ముస్తఫా, జహంగీర్‌బాషా, నాసర్, అహ్మద్, రసూల్ పాల్గొన్నారు.

విద్యుత్ లేక మూడు గ్రామాల్లో తాగునీటికి ఇక్కట్లు



కామసముద్రంలో ట్యాంకరు నీటిని పట్టుకుంటున్న ప్రజలు

అట్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలోని కామసముద్రం, వరదరాజుపల్లె, వరికుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరాలేక ఐదురోజులుగా తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వేసవి కావడంతో పశువులకు సైతం తాగునీరు అందించలేకపోతున్నామని ప్రజలు వాపోతున్నారు. గత ఐదు రోజుల క్రితం గాలివాన బీభత్సానికి విద్యుత్‌స్తం భాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి సమస్య నెలకొంది.ఈ సంద ర్భంగా కామసముద్రం సర్పంచ్ రాజోలు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐదురో జుల క్రితం గాలివానతో విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయని విద్యుత్ అధికారులు అర కొరగా పనులు చేపట్టి గ్రామాల్లో ఉన్న మోటర్లకు త్రీఫేజ్ కరెంటును పునరుద్ధరిం చకుండా నిర్లక్ష్యం చేయడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ట్యాంకర్ల ద్వారా ఇతర గ్రామాల పొలాల మోటర్ల నుంచి గ్రామంలో నీటి సదుపాయం కల్పి స్తున్నామని సర్పంచ్ తెలిపారు. అధికారులు స్పందించి కామసముద్రం, వరదరా జుపల్లె వరికుంట దళిత వాడలకు వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించాలని గ్రామ స్థులు కోరుతున్నారు. కాగా విద్యుత్ ఏఈ విజయకుమార్ మాట్లాడుతూ గాలివా నకు విద్యుత్ స్తంభాలు ఎక్కువగా పడిపోవడంతో పునరుద్ధరణ పనులు ఆలస్య మవుతున్నాయన్నారు. సాధ్యమైనంత వరకు పనులు పూర్తి చేసి తాగునీటి సరఫరాకు విద్యుత్ అందిస్తామన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



పట్టుబడ్డ నిందితుడితో సీఐ మోహన్, పోలీసులు

ఖాజీపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్నా వదినలపై దాడికియత్నించి వదినపై దాడికిపాల్పడిన దానం నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు సీఐ మోహన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఈలై విలేకరులతో మాట్లాడుతూ డ్యాన్‌ఖాన్‌పల్లె గ్రామానికి చెందిన దానం నాగేశ్వరరావు భార్య పార్వతిని అన్న అనంతరావు నరికి చంపిన కేసులో రాజీపడి డబ్బులిచ్చే విధంగా ఒప్పుకున్నాడన్నారు. అందులో కొంతమాత్రమే ఇచ్చి మిగతాది ఇవ్వకపోగా నానా దుర్భాషలు మాట్లాడారన్నారు. దీంతో మనస్థాపానికి గురై 28వ తేదీ రాత్రి అన్నా వదినెలను చంపాలని వారి ఇంటికి వెళ్లగా అన్న లేకపోవడంతో వదినె లక్ష్మీదేవిపై దాడి చేయబోయాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో ఆమెకు సమీప బంధువు నవీన్‌రావు అడ్డుకోవడంతో అతనిపై కూడా దాడి చేసి పరారయ్యాడన్నారు. దీంతో సోమవారం నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు



కొండాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి) నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణకు సోమవారం కొండాపురం పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. నేషనల్ హైవే పై ఇటీవల ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల అడ్డుకట్టకు పోలీసులు నడుం బిగించారు. కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కొండాపురంలోని రెండు ప్రధానకూడళ్లలో బారికేడ్ల ను ఏర్పాటుచేశారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో క్రాసింగ్‌లు వాహనదారులు దాటేవారిని గమనించి నెమ్మదిగా వెళ్లాలని ఎస్‌ఐ సూచించారు.

జీవో 77 రద్దు తర్వాతే ఐసెట్ నిర్వహించాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పీజీ చదవాలనుకునే పేద విద్యార్థులకు అడ్డుగా మారిన జీవోనెం.77ను రద్దు చేసిన తర్వాతే ఈ సంవత్సరం ఐసెట్ నిర్వహించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చరణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ తమ పార్టీ అధికారంలోకి వస్తే జీవోనెం.77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ పట్టణాధ్యక్షుడు శివనారాయణ, నితిన్, వెంకటేష్, శ్రావణ్, సుదర్శన్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఈత ప్రాణ రక్షణ విద్య

ప్రొద్దుటూరు రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈత ప్రాణరక్షణ విద్యగా దోహదపడుతుందని జాతీయ స్విమ్మింగ్ క్రీడాకారుడు లక్ష్మీనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రొద్దుటూరు శివారులోని ఎగ్జిక్యూటివ్ హెల్త్‌క్లబ్ స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులకు సంబంధించిన ఈత ఏర్పాట్లను చేపట్టారు. ఈ సందర్భంగా చత్తీస్‌గడ్‌కు చెందిన కోచ్ సురేష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ ఈత నేర్చుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ప్రమాదాల నుంచి భయటపడవచ్చని చెప్పారు. ఈతకు వయోపరిమితి లేదని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు ఎగ్జిక్యూటివ్ హెల్త్‌క్లబ్‌లో గత 20 సంవత్సరాలుగా తాను ఈతలో శిక్షణ ఇస్తున్నానని ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రతి ఒక్కరు మంచి అవకాశంగా భావించి శిక్షణ పొందాలని వివరించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బి.కోడూరు, మే 5 (ఆంధ్రజ్యోతి):మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ కోడూరు చెన్నమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ తమ నివేదికలతో తప్పక హాజరు కావాలని తెలిపారు. బుధవారం ఉదయం 10గంటలకు అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

పాఠశాల విద్యలో అసంబద్ధ విధానాలు వద్దు



ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యారంగంలో సంస్కరణల పేరుతో తెస్తున్న అసంబద్ధ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ. శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో పాఠశాల విద్యావ్యవస్థ నష్టపోతోందన్నారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలు ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఒక్కో పాఠశాలకు ఒక్కో రకమైన విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 1 నుంచి 5 తరగతి వరకు మోడల్ ప్రాథమిక లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాల కొనసాగించాలని ఆ పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7 తరగతులు ఉన్నచోట నలుగురు స్కూల్ అసిస్టెంట్లను, 6, 7, 8 తరగతులు ఉన్నచోట ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 9న జిల్లా కేంద్రాల్లో, 14న విజయవాడలో ధర్నాలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, మునివర్ధన్ కుమార్, కుళాయిరెడ్డి, కృష్ణారెడ్డి, అప్సర్‌పాషా, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, సయ్యద్‌బాష, ఈశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదుల వెల్లువ



ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

జమ్మలమడుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సాయిశ్రీకి సమస్యలపై పలువురు వినతి పత్రాలు అందజేశారు. జమ్మలమడుగు ఆర్టీసీ ఉద్యోగులు నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు 33 డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప రీజినల్ ఛైర్మన్ శేషన్న, నాగేంద్ర, శేఖర్, నూర్‌బాష, రమణ, శివుడు తదితరులు పాల్గొన్నారు. . అలాగే మైలవరం మండలం మౌలాలి అనే బాధితుడు పీర్ల మాన్యం భూములు ఆక్రమించారని వినతి పత్రం అందజేశాడు. అలాగే మరికొన్ని గ్రామాల నుంచి బాధితులు వారి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు

పోరుమామిళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఈదురు బలమైన గాలులకు విద్యుత్ తీగలపై విపరీతంగా చెట్లు పడిపోయి స్తంభాలు విరగడంతో విద్యుత్ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేశారు. బలమైన గాలులతో పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగిందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రవిచంద్రశేఖర్, ఏఈ వెంకటమహేశ్‌లు తెలిపారు. పోరుమామిళ్ల పట్టణంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరించడం జరిగిందన్నారు. అన్ని గ్రామలకు తాగునీరు అందించే విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్లు సరిచేసి ప్రజలకు తాగునీటికి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రైతుల పొలాలకు పడిపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పనులు చేపట్టామన్నారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా సమస్య ఉంటే పోరుమామిళ్ల ఏఈ 9440811985, కాశినాయన ఏఈ 9490156501. బి.కోడూరు ఏఈ 9440817445, కలసపాడు ఏఈ 9440811984, ఏడీఈ 9440811983 కి ఫోను చేయాలని తెలిపారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



జీవీ రమణను సత్కరిస్తున్న మురళి

ప్రొద్దుటూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు జీవీ రమణ పేర్కొన్నారు. ఇటీవల చలో పిఠాపురం కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించి విజయవంతం కావడానికి కృషి చేసిన జనసేన పార్టీ సీనియర్ నాయకుడు జీవీరమణను జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయ సాధనకోసం కార్యకర్తలు ఎటువంటి త్యాగాలు చేయడానికైనా వెనుకాడరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణయ్యాయాదవ్, దేవానంద్, రవిశంకర్, సంజీవ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



పోరుమామిళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మేజ రు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్‌నాయుడుకు సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసంద ర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో రవిశం కర్‌రెడ్డి, పంచాయతీ ఉప సర్పంచ్ రాళ్లపల్లి రవికుమార్, ఇమాంఉసేన్, షరీఫ్, తోట వెంకటసుబ్బయ్య, చెన్నూరు వెంకట్రమణ, మేడిశెట్టి వెంకటేశ్వర్లు, ధర్వేష్‌లు తదితర లు పాల్గొన్నారు.

రైతులు జీవామృతంతో పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న మాస్టర్‌ట్రైనర్ కృష్ణారెడ్డి

చాపాడు, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులు జీవామృతంతో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ క్రిష్టారెడ్డి అన్నారు. చాపాడులోని రైతు సేవా కేంద్రంలో సోమవారం ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మనం ఆరోగ్యవంతంగా జీవించాలంటే పంట ఉత్పత్తులు పచ్చిపేడ, ఎండిన ఎరువు ద్వారా జీవామృతం తయారు చేసుకుని పంటలు పండించుకోవాలన్నారు. వరి, వేరుశనగ, పసుపు, ఉద్యాన పంటలు అయిన సపోట నిమ్మ, దానిమ్మ, జామ వంటి వాటికి ఎరువుగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఉద్యావన పంటలు డ్రిప్ ద్వారా ఉపయోగించి నీటిని పొదుపు చేసుకోవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారిణి మ్యాగి, ఏపీవో జగదీష్‌రెడ్డి, ఏపీఎం శ్రీధర్, గ్రామ సచివాలయ వ్యవసాయ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నకిలీ డిఫారం ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలి

ఖాజీపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): నకిలీ డి.ఫారం ఉన్నవారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్‌కు పుల్లూరు ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థులందరు కలిసికట్టుగా గుడి నిర్మించుకోవాలని శంకుస్థాపన చేస్తే నకిలీ డి.ఫారం సృష్టించి దేవాలయ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఫిర్యాదు చేశారు. అందులో ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ స్థలం మాది అంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు 130 మంది సంతకాలు చేసి ఫిర్యాదు చేశామన్నారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు

పోరుమామిళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి) :సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో రమణారెడ్డి అన్నారు. సోమవారం ఆయన పోరుమామిళ్ల పంచాయతీలోని సచివాలయం-2, 3లను ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చాలా సచివాలయాల్లో సిబ్బంది గైర్హాజరవుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయంలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలాన్నారు. సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను కూడా గడువులో పూర్తి చేయాలన్నారు.